క్లుప్తంగా

సాయిచంద్‌కు నివాళి



అలంపూర్: దివంగత రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్‌కు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం నివాళి అర్పించారు. హైదరాబాదులోని గుర్రంగూడలోని సాయిచంద్ నివాసంలో శనివారం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు.

దరఖాస్తుల పరిశీలన



అలంపూర్ రూరల్: బీసీ కులవృత్తిదారులకు అందించే రూ.లక్ష రుణాల కోసం చేసిన దరఖాస్తులను వారి ఇళ్లను సందర్శించి అధికారులు సోమవారం పరిశీలించారు. 90 మంది జాబితా రాగా అందులో 20 దరఖాస్తులు బోయ తెలుగు ఈడిగ, కురువ వారు కూడా ఉన్నట్లు తెలిపారు. మిగితా 70లో 29 దరఖాస్తుల పరిశీలిన చేసినట్లు అధికారులు వెంకట్రాముడు, నిలీష్‌కుమార్ తెలిపారు.

ఓటరు జాబితా..

కేటీదొడ్డి: రాబోయే ఎన్నికల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు జాబితా పరిశీలన చేస్తున్నట్లు తహసీల్దార్ సుందర్ రాజు తెలిపారు. మండలంలోని సోంపురం, ఎర్సందొడ్డి, సుల్తాన్‌పురంలో శనివారం బీఎల్‌ఓలు ఓటరు జాబితాను పరిశీలించిన విషయంపై తహసీల్దార్ ఆరా తీశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మానవపాడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు హెచ్ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అదేవిధంగా స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ చైతన్య ఐదుగురు పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్స్, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో రాంమూర్తి, రమేష్‌గుప్త, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి బంగారం వితరణ

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పాగుంటకు చెందిన పరమేష్ దంపతులు 6 గ్రాముల బంగారాన్ని కిరీటం నిమిత్తం శనివారం ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: పట్టణంలోని టౌన్–1 ఫీడర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు, పెద్ద వాగుపై బ్రిడ్జి పనుల కారణంగా విద్యుత్ లైన్‌ను పక్కకు మార్చేందుకు ఆదివారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బాలస్వామి శనివారం ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్‌చౌక్, పాత పోలీస్ స్టేషన్, దుర్గానగర్, మాలపేట, పాతబస్టాండ్ కాలనీల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

కాలనీవాసులను భయపెట్టించిన పాము



అలంపూర్ రూరల్: పట్టణంలోని సాలెవీధిలో శనివారం తెల్లవారుజామున పాము (జెర్రిపోతు) కాలనీవాసులను భయపెట్టించింది. కోటగోడ సమీపంలో సాలేవీధి ఉండడంతో చుట్టూ పాడైపోయిన ఇళ్లు, కంపచెట్ల నుంచి పాములు తరుచూ వస్తుంటాయని స్థానికులు తెలిపారు. సాయంత్రం కాగానే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని వారు వాపోయారు. కాలని వాసులు పామును చంపారు. అధికారులు చొరవ చూపి ముళ్లపొదలను తొలగించాలని కాలనీమహిళలు కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయిజ: ప్రభుత్వం విధించిన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఎల్ ట్యాక్సీ ఆఫీసర్ ఉమాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ సమీపంలో గద్వాల వే బిల్లుతో వచ్చిన సిమెంట్ లారీని ఆమె తనిఖీ చేశారు. ఒక ప్రాంతానికి వే బిల్లు తీసుకుని మరొక ప్రాంతానికి వెళ్తున్నందుకు కేసు నమోదుచేసి పోలీస్ స్టేషన్‌లో లారీని అప్పగించారు.

పేదల చదువంటే చులకనా?



చెత్తాచెదారంతో శిథిలావస్థలో ఉన్న గంజిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- గంజిపేటలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనం
- అంగన్‌వాడీ కేంద్రంలో తరగతుల నిర్వహణ
- మన ఊరు–మన బడిలో చేర్చకపోవడంపై విమర్శలు

గద్వాల అర్బన్: పట్టణంలోని గంజిపేట హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చాలా మంది చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఒకప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రాచుర్యం పొందిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇదొకటి. ఈ పాఠశాల భవనం పూర్తిగా పాడుబడిపోయింది. శిథిలావస్థకు చేరుకుని భవనం నిరుపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి పథకంలో ఈ బడిని ఎంపిక చేయకపోవడం ఎంటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. కాలనీలో ఎక్కువ శాతం కూలీలు, నిరుపేదలు ఉన్నారు. కాలనీలో బడి దుస్థితి ఇలా మారడంతో ప్రైవేట్ బడుల్లో రూ.వేలల్లో ఫీజులు కట్టి తాము చదివించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30ఏళ్ల కింద నిర్మాణం

ఈ పాఠశాల భవనాన్ని 30ఏళ్ల కిందట నిర్మించారు. ఒకప్పుడు ఈ పాఠశాలలో 350–400 మంది విద్యార్థులు అభ్యసించగా, 8మంది ఉపాధ్యాయులు బోధించేవారు. నాలుగు గదుల్లో 1–5 తరగతులను కొనసాగించేవారు. అయితే పాఠశాల భవనం పూర్తిగా శిథిలమై పోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమేనా తగ్గింది. ఇక వంట గది పైకప్పు పూర్తిగా కూలిపోయింది. దీంతో పాఠశాల భవనం మూతపడింది. గతంలో అధికారులు పాఠశాల భవనాన్ని పరిశీలించారే తప్పా, మరమ్మతుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ విషయంపై పలు మార్లు విద్యాశాఖ అధికారులు, స్థానిక కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం ఆ భవనం నిరుపయోగం మారి ఆవరణ మంతా చెత్తతో నిండిపోయింది.

అంగన్‌వాడీ భవనంలో తరగతులు

ఈ పాఠశాల భవనంలో అన్ని గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అధికారులు 1–3తరగతుల సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో కొనసాగిస్తున్నారు. 4–5తరగతులను అక్కడే కొనసాగిస్తుండేవారు. అయితే ఆ గదులు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరగా, అదే కాలనీలో అంగన్‌వాడీ భవనంలోని ఒకే గదిలో రెండు తరగతులను నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో దాదాపు 57మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అక్కడ కూడా విద్యార్థులకు మౌలిక వసతులు కరువైయ్యాయి. పాఠశాలకు భవనం మూతపడడంతో కాలనీవాసులు తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కొత్త పాఠశాల నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



గంజిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి ఎప్పుడు పడిపోతుందో అనే పరిస్థితి ఉండేది. అయితే గతేడాది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అక్కడ సమీపంలో వేరే భవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ భవనంలో తరగతులను కొనసాగిస్తున్నాం. మన ఊరు–బడి కార్యక్రమం ఎంపిక చేసి కొత్త భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఎంఈఓ, గద్వాల

అభ్యర్థులకు తప్పని ప్రయాణ తిప్పలు



అలంపూర్ చౌరస్తాలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులు

అలంపూర్: గ్రూప్–4 అభ్యర్థులకు ప్రయాణ పరీక్ష తప్పలేదు. అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డుపై శనివారం అభ్యర్థులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. అలంపూర్, ఉండవెల్లి మండలాల్లోని కేంద్రాలకు ఆయా జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. ఈ రెండు మండలాల్లో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలంపూర్ మున్సిపాలిటీలో 1,056 మంది, అలంపూర్ చౌరస్తాలోని 888 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఉదయం కేంద్రాలకు వారి వాహనాల్లో చేరుకున్నారు. అనంతరం సాయంత్రం గమ్యస్థానాలకు వెళ్లడానికి అలంపూర్ చౌరస్తా చేరుకున్నారు. అభ్యర్థులు అంతా ఒకేసారి రావడంతో సకాలంలో అదనపు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. నిరీక్షణ అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

భోజన సదుపాయం కల్పించిన స్థానికులు

అలంపూర్ రూరల్: పట్టణంలో సోమవారం గ్రూప్–4 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు దారా రజినిబాబు పుట్టిన రోజు సందర్భంగా మూడు కేంద్రాల వద్ద కేంద్రాలలో సుమారు 700 మందికి భోజన భోజన సదుపాయన్ని కల్పించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు అభినందించారు. కాగా సహాయ సహకారాలు అందించిన అంబేద్కర్‌కాలనీ యూత్, వివేకనంద యూత్, శ్రీను, ముస్తఫా, రంగస్వామి, ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రాజోళిలోని అంగన్‌వాడీలో గుడ్లను పరిశీలిస్తున్న సీడీపీఓ

రాజోళి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ సుజాత శనివారం తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చే గుడ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పలు చోట్ల కుళ్లిన గుడ్లు వచ్చిన నేపథ్యంలో గుడ్లు తీసుకునేటప్పుడు పరిశీలించాలన్నారు. గుడ్లపై వచ్చే ముద్రను తప్పకుండా చూసి తీసుకోవాలని, నాణ్యత లేకుంటే వెంటనే వెనక్కి పంపాలన్నారు. పిల్లల ఎత్తు, బరువును పరిశీలించిన ఆమె, వారికి ఇస్తున్న ఆహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు.

యువకుడు అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని తక్కశీలకు చెందిన అయ్యన్న అదృశ్యంపై తండ్రి గొల్ల రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు శనివారం తెలిపారు. గొల్లరాముడుకు కుమారుడు, కూతురు ఉండగా, కుమారుడుకు ఇటిక్యాల మండలం చాగాపురం చెందిన సుజాతతో రెండేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయి, కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవారని పేర్కొన్నారు. గతనెల 15వ తేదీ రాత్రి బైక్‌పై ఎక్కడికో వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ప్రొసిడింగ్ కాపి అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

మానవపాడు: గ్రామాల్లో సమగ్రాభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం మండలంలోని బోరవెల్లిలో మైనార్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రొసిడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. బోరవెల్లిలో రూ.10లక్షలతో మైనార్టీ కమ్యూనిటీ హాల్ నిర్మానానికి ప్రొసిడింగ్ కాపి అందించామన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాముడు, వెంకటేష్, కృష్ణయ్యనాయుడు, కృష్ణగౌడ్, సలీంమియ్యా, అహ్మద్, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–4 పరీక్ష



ధరూరులో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

ధరూరు: మండలంలో శనివారం గ్రూప్ –4 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మండలంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240కి గాను 38 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 264కు గాను 54మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు కృష్ణ, ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

మల్దకల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 312 మంది అభ్యర్థులకు గాను 263 మంది అభ్యర్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఇమానియేల్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాన్ని రూట్ 7 అధికారి సాయిప్రకాష్ తనిఖీ చేశారు.

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బ్రైట్ స్టార్ ఉన్నత పాఠశాల, హరిహర జూనియర్ కళాశాల, అరోర జూనియర్ కళాశాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలవద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 1,824 మంది అభ్యర్థులకు గాను 348 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ రాజు తెలిపారు. ఎర్రవల్లి ఏకశిల పాఠశాలలో 264కు గాను 213, కొండేరు జిల్లా పరిషత్‌లో 312కు గాను 261, బీచుపల్లి గురుకులలో 312కు గాను 261, ఎర్రవల్లి సరస్వతి ఇంటర్‌నేషనల్‌లో 288కు గాను 241, సరస్వతి పాఠశాలలో 432కు గాను 372, ఇటిక్యాల సాఫీక సంక్షేమ గురుకుల–ఏలో 240కు గాను 193, ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల–బీ లో 240కు గాను 199 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

అలంపూర్: గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ కేంద్రంలోని హరిజనవాడ జెడ్పీహెచ్ఎస్ 240 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 197 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మందికిగాను 37 మంది, మాంటిస్సోరి పాఠశాలలో 576 మందికిగాను 99 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.



ఎర్రవల్లిలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



అలంపూర్‌లోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

అలంపూర్ చౌరస్తాలో..

ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో మూడు పరీక్ష కేంద్రాల్లో విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో 240 మంది అభ్యర్థులకుగాను 207 మంది, విశ్వశాంతి జూనియర్ కళాశాలలో 312 మందికిగాను 254 మంది, ప్రయాగ్ పాఠశాలలో 336 మందికి గాను 276 మంది అభ్యర్థులు హాజరయ్యారు.



మల్దకల్‌లో పరీక్ష కేంద్రంలో వెళ్తున్న అభ్యర్థులు

వైద్యుల సేవలు వెలకట్టలేనివి



వైద్యుడిని సన్మానిస్తున్న సిబ్బంది

రాజోళి: సమాజంలో ఎంతో మంది సేవలందిస్తున్నప్పటికీ వైద్యుల సేవలు మాత్రం వెలకట్టలేనివని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. శనివారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ మధుబాబును శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సమయం అనేది లేకుండా కేవలం ఆపదను మాత్రమే దృష్టిలో పెట్టుకుని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి ప్రాణం పోసేది వైద్యుడేనన్నారు. వైద్యాన్ని వృత్తిలా కాకుండా ప్రాణాలు పోసే శక్తిగా భావించి ఎందరో వైద్యులు ప్రజలకు సేవలిందిస్తున్నారన్నారు.

రేషన్ సరుకులకు బయోమెట్రిక్



మానవపాడులో బయోమెట్రిక్ వేస్తున్న డీలర్లు

మానవపాడు: రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ డీలర్లకు మండల స్టాక్ పాయింట్ నందు ఈ–పాస్ బయోమెట్రిక్ ప్రవేశపెట్టారని ఇటిక్యాల, మానవపాడు మండల అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, అయ్యన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బియ్యం స్టాక్ పాయింట్ వద్ద బయోమెట్రిక్ విధానం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల కచ్చితమైన తూకం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు రామేశ్వరమ్మ, గంగాధర్‌రెడ్డి, బాబన్న, కృష్ణ, గజేందర్‌రెడ్డి, గోదాం ఆపరేటర్ సురేష్ ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం



మాట్లాడుతున్న అధ్యక్షుడు మద్దిలేటి

మానవపాడు: సహకార ఉద్యమం, ఆశయాలు, లక్ష్యాల గురించి ప్రజలలో చైతన్యం కలిగించడంతో అంతరాతీయ సహకార దినోత్సవం చేసుకుంటున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు మద్దిలేటి, ఉపాధ్యక్షుడు అయ్యన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జెండా ఆవిష్కరించారు. సహకార సంఘాల ఏర్పాటుతో రైతులకు రుణ సౌకార్యం వచ్చిందన్నారు. గ్రామ, మండలస్థాయి సంఘాల పరిధిలో బ్యాంకుల ద్వారా చిన్న, సన్నకార రైతులకు బ్యాంకు రుణాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ అసిస్టెంట్ ప్రభాకర్‌నాయడు, సిబ్బంది రమేష్‌నాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభయాంనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ఆకుపూజ, పంచామృత అభిషేకం చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అభయాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం



పైపాడులో కరపత్రాలు పంచుతున్న బీజేపీ నాయకులు

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో బీజేపీ కర్ణాటక విస్తారక్ నజీర్‌బాషా ఆధ్వర్యంలో శనివారం నాయకులు ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 9ఏళ్లలో చేపట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, బలరాంరెడ్డి, జగన్‌గౌడ్, ఆంజనేయులు, ఐలప్ప, దేవేందర్, చందు, మునిస్వామి, వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ : వడ్డేపల్లి పట్టణంలోని పైపాడులో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, తనగలలో మండల అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి కర్ణాటక విస్తారక్ శశిధర్ దిండూర్, సుదర్శన్‌రెడ్డి హాజరై ప్రచారంలో పాల్గొన్నారు.

బీజేపీ వైపు మొగ్గు

రాజోళి: తెలంగాణ ప్రజలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నధన్వాడ, పెద్ద ధన్వాడ, ననసూర్, తుమ్మిళ్ల, మాన్‌దొడ్డిలో కరపత్రాలను పంచారు. రాష్ట్రంలో ఎన్నో పథకాలల్లో కేంద్ర ప్రభుత్వ నిధుల వాటా ఉందని తెలిపారు. కార్యక్రమంలో విస్తారక్ భాగ్యలక్ష్మి, స్వప్న, దేవేందర్, గజేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి, తిమ్మాపురం పోలింగ్ బూత్‌లలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక విస్తరక్ మంజునాథ్ హాజరై నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, అంగన్‌వాడీలలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, సబ్సిడీ ఎరువులు, ఉచిత రేషన్ బియ్యం తదితర పథకాల గురించి అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు.

అయిజ: బీజేపీ కార్యకర్తలు ప్రతి గ్రామంలో, పట్టణంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురంలో మేరా బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పార్టీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న శేక్షావలి ఆచారి

అయిజ: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని టీపీసీసీ అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి అన్నారు. పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వార్డులకు సంబంధించిన బూత్ లెవల్, మహిళా కమిటీలను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో నాగ శిరోమణి, సులోచనమ్మ, సాంబశివుడు, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామానికి చెందిన యువరాజ్ బీఎస్పీ మండల అధ్యక్షుడిగా శనివారం ఎన్నికయ్యారు. జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణ ఆధ్వర్యంలో శాంతి నగర్ పట్టణంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన శిక్షణ తరగతులలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అందరి సహకారంతో తన వంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.